# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 22-07-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

❖ వ్యవసాయ శాఖపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నారు.

❖ మామిడి రైతులకు నష్టం వాటిల్ల కుండా కిలో మామిడిని 12 రూపాయలకు కొనుగోలు చేస్తున్నామని మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు.

❖ సైబర్ నేరాలను నివారించే విధంగా టీటీడీలో సైబర్ సెక్యూరిటీ ల్యాబ్ ఏర్పాటు చేస్తామని టీటీడీ కార్యనిర్వహణాధికారి జె.శ్యామలరావు వెల్లడించారు.

❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 124వ సంచిక ఈ ఆదివారం ప్రసారమవుతుంది.

❖ ఉత్తర బంగాళాఖాతంలో ఈ గురువారం నాటికి అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణం కేంద్రం తెలియజేసింది.

========================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యవసాయ శాఖపై సమీక్ష జరుపుతున్నారు. ఈ రోజు అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఈ సమీక్ష సమావేశంలో వ్యవసాయ రంగానికి సంబంధించిన పలు అంశాలపై ముఖ్యమంత్రి అధికారులతో చర్చిస్తున్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చంనాయుడు, ఆ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

========================

తోతాపూరి మామిడి క్వింటాకు 1,490 రూపాయలను మద్దతు ధరగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం పట్ల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రకటనపై మంత్రి ఈరోజు స్పందిస్తూ.... మామిడి రైతులకు నష్టం వాటిల్ల కుండా కిలో మామిడిని 12 రూపాయలకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కిలో మామిడికి 4 రూపాయల రాయితీని అందచేశామని అన్నారు. పొరుగు రాష్ట్రాల కంటే

మెరుగైన ధరను మామిడి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అందచేసిందని తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ లకు మంత్రి కృతజ్ఞతలు తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ రోజు తోతాపూరి మామిడి క్వింటాకు 1,490 రూపాయలను మద్దతు ధరగా ప్రకటించింది. 50:50 నిష్పత్తిలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు మద్ధతు ధరను చెల్లిస్తాయి. నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ కానుంది.

========================

సైబర్ నేరాలను నివారించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో సైబర్ సెక్యూరిటీ ల్యాబ్ ఏర్పాటు చేయనున్నామని, అలాగే తిరుమలలో అన్ని కార్యాలయాలు ఒకేచోట ఉండేలా పరిపాలన భవనం నిర్మించనున్నామని టిటిడి కార్యనిర్వహణాధికారి జె.శ్యామలరావు తెలపారు. ఛైర్మన్ బి.ఆర్.నాయుడు అధ్యక్షతన టిటిడి పాలకమండలి సభ్యులు ఈరోజు తిరుమలలోని అన్నమయ్య భవనంలో సమావేశమయ్యారు. ఈ సమావేశం వివరాలను ఈఓ జె.శ్యామల రావు పాత్రికేయులకు తెలియజేశారు. భక్తుల వేచిఉండేందుకు అనువైన నిర్మాణాలు చేపట్టడంపై చర్చించామని తెలిపారు. 700 మంది వేదపారాయణదారులకు ఉద్యోగాలు కల్పించాలని నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. ఒంటిమిట్ట కోదాండరామాలయంలో పూర్తిస్థాయిలో అన్నప్రసాద వితరణకు 4.35 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేశామని.. ఆగష్టు నెల నుండి అక్కడ భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని శ్యామలరావు వెల్లడించారు. తిరుమలలోని 3వ వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నిర్మించాల్సిన ఆవశ్యకతపై కమిటీ ఏర్పాటు చేశామని వివరిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

========================

రాష్ట్రంలో జిల్లాలు, మండలాలు, గ్రామాల సరిహద్దుల పేర్ల మార్పులు చేర్పులపై అధ్యయనం చేయడానికి మంత్రివర్గ ఉపసంఘాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మంత్రులు అనగాని సత్యప్రసాద్, పొంగూరు నారాయణ, వంగలపూడి అనిత, బీసీ జనార్దన్ రెడ్డి, నిమ్మల రామానాయుడు, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్ లను సభ్యులుగా నియమించింది. ఈ ఉపసంఘానికి కన్వీనర్‌గా రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వ్యవహరిస్తారని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. మంత్రులు పరిపాలనా సౌలభ్యం కోసం తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేయాలని తెలిపింది.

========================

కృష్ణా జిల్లా గన్నవరం మార్కెట్ యార్డులో కార్డుదారులకు అందించే రేషన్ బియ్యాన్ని, మధ్యాహ్నం భోజన పథకంలో అందించే బియ్యాన్ని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పరిశీలించారు. ఈరోజు ఆయన నిర్వహించిన ఆకస్మిక తనిఖీలో పేదలకు అందించే రేషన్ బియ్యం కొలతల్లో.. బస్తాల్లో వ్యత్యాసం ఉండటం గమనించారు. పేదలకు అందించే రేషన్ బియ్యం తూనికల్లో తేడాలు ఉండరాదని, సకాలంలో రేషన్ దుకాణాలకు సరఫరా చేయాలని సంబంధిత అధికారులకు మంత్రి స్పష్టం చేశారు.

విరామం

========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 124వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు 25వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

========================

రైతులు దేశ ఆర్థిక వ్యవస్థలో భాగమని ఎన్.టి.ఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. ఈరోజు నందిగామ మండలం, కేతవీరునిపాడు గ్రామంలో రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "పొలం పిలుస్తోంది" కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంభించి, పంటల ఉత్పాదకతను పెంచే దిశగా కృషి చేయాలని కోరారు. రైతులకు సాంకేతిక సలహాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించడం ద్వారా వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చగలమని ఆశాభావం వ్యక్తం చేశారు.

========================

ఐటీతో పాటు ఇతర రంగాలకు చెందిన పలు సంస్థలు మంగళగిరికి రావడానికి ఆసక్తి చూపిస్తున్నాయని, భవిష్యత్ లో 50 వేల మంది పని చేసేందుకు ఇక్కడ అవకాశం ఉందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఈ రోజు గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో మంత్రి సమీక్షించారు. పనుల పురోగతిని అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మంగళగిరికి ఐటీ, నాన్ ఐటీ కంపెనీలు రావడానికి అవసరమైన మౌలిక వసతుల కల్పనపై అధికారులు దృష్టిసారించాలన్నారు. వివిధ ప్రభుత్వ భూముల్లో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న వారికి రెండో విడతలో 2 వేల ఇళ్ల పట్టాల పంపిణీకు చర్యలు చేపట్టాలని అదేశించారు. ప్రజలు నివసించేందుకు అనుకూలంగా వివిధ ప్రాంతాల్లో నియోజకవర్గ వ్యాప్తంగా 10 వేల టిడ్కో ఇళ్లను నిర్మించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

========================

“అమృత్ భారత స్టేషన్ 2.0” పథకంలో భాగంగా విజయవాడ రైల్వే స్టేషన్ అభివృద్ధికి నీతి ఆయోగ్ మంజూరు చేసిన 836 కోట్ల 47 లక్షల రూపాయల నిధులను రైల్వే శాఖ త్వరితగతిన విడుదల చేయాలని రైల్వే బోర్డ్ చైర్మన్ సతీష్ కుమార్ ను విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ విజ్ఞప్తి చేశారు. ఈ రోజు న్యూఢిల్లీలోని రైల్ భవన్ లో చైర్మన్ ను కలిసి విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని సమస్యలను ఎంపీ వివరించారు. నాలుగు లెవెల్ క్రాసింగ్ల వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ల నిర్మాణం, రోడ్ అండర్ బ్రిడ్జ్ల నిర్మాణ పనులు త్వరిత గతిన పూర్తిచేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు స్వల్ప నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 82,200 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై... చివరికి 14 పాయింట్ల నష్టంతో 82,186 వద్ద ముగిసింది. నిఫ్టీ 29.80 పాయింట్ల నష్టంతో 25,060 వద్ద స్థిరపడింది.

========================

భారత్, ఇంగ్లాండ్ మహిళా క్రికెట్ జట్ల మధ్య మూడవ వన్డే క్రికెట్ మ్యాచ్ కొద్ది సేపటి క్రితం లండన్లో ప్రారంభమైంది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ 5 ఓవర్లు పూర్తయ్యే సరికి వికెట్ నష్టపోకుండా 27 పరుగులు చేసింది.

========================

ఈనెల 24వ తేదీ నాటికి ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. మరిన్ని వివరాలను వాతావరణ శాఖ అధికారి వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

========================
========================